క్లుప్తంగా

ప్రశాంతంగా పాలీసెట్ ప్రవేశపరీక్ష



పాలీసెట్ పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

ఆదోని అర్బన్: పట్టణంలో పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్ష ఏడు కేంద్రాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 2,891 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,620 మంది హాజరయ్యారు. 221 మంది గైర్హాజరయ్యారు. 1,823 మంది బాలురు, 797 మంది బాలికలు పరీక్ష రాశారు. ఆదోనిలో ఏడు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాశారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న సెబ్ సీఐ హరికృష్ణ, సిబ్బంది

ఆదోని రూరల్: ఆదోని సెబ్‌స్టేషన్ పరిధిలోని సింగరాజుమలే కొండల్లో నాటుసారా స్థావరాలపై బుధవారం సెబ్ సీఐ హరికృష్ణ, ఎస్‌ఐలు శివప్రసాద్, మధుసూదన్, పీసీలు రోహిన్, సుధాకర్ దాడులు చేశారు. నాటుసారా తయారీ కోసం ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటతో పాటు 10 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సారా క్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. నిందితుడు తప్పించుకుని పారిపోయాడని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చెక్‌పోస్టు వద్ద డీఎస్పీ తనిఖీ

మంత్రాలయం: మండల పరిధిలోని మాధవరం గ్రామ శివారులో ఉన్న సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. కర్ణాటక వైపు నుంచి రాష్ట్రంలోకి వచ్చే వాహనాలు, ఏపీ నుంచి కర్ణాటక వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే ముందుకు పంపారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు కిరణ్, వేణుగోపాల్‌రాజు తదితరులు ఉన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో ఎవరైనా అలర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. ఆయన బుధవారం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు,. ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. ఎవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే శిక్షిస్తామన్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్ ఉన్నారు.

భూయజమాని హక్కులకు నష్టం ఉండదు



చిన్నతుంబళం ఆర్బీకేలో మాట్లాడుతున్న ఏఓ ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు: కౌలు రైతులు పంటసాగు పత్రం పొందడానికి అవసరమయ్యే అంగీకార పత్రంపై సంతకం చేయడం వల్ల భూయజమాని హక్కులకు ఎలాంటి నష్టం ఉండదని ఏఓ ఎం.వరప్రసాద్ పేర్కొన్నారు. చిన్నతుంబళం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు ప్రభుత్వం అందించే ధ్రువీకరణ పత్రం ఆవశ్యకతపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. కౌలు పత్రం పొందిన రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే రైతు భరోసా వర్తిస్తుందన్నారు.

అంతేకాకుండా పంటనష్ట పరిహారం తదితర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీఆర్‌ఓ కృష్ణమూర్తి, వ్యవసాయ సిబ్బంది రవితేజ, రమాదేవి, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప తదితరులు ఉన్నారు.

రాఘవేంద్ర స్వామికి అభిషేక పూజలు

మంత్రాలయం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి అభిషేకం వైభవంగా నిర్వహించారు. బంగారం కవచం, పట్టు వస్త్రాలు, తులసిమాల, పూలదండలతో స్వామి వారి బృందావనాన్ని సుందరంగా అలకరించారు. పీఠాధిపతి బృందావనానికి మంగళహారతి ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మ, స్వామి బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

లక్ష్మమ్మవ్వ రథోత్సవానికి వేళాయె

- రేపు మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర మహోత్సవం
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



ఆలయ గర్భగుడికి ఏర్పాటు చేసిన బంగారు తొడుగు



బంగారంతో తయారు చేసిన అవ్వవారి విగ్రహం



వెండి రథం

ఆదోని అర్బన్: భక్తుల ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ 91వ వెండి రథోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాచోటి రామయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వస్తి శ్రీ శుభకృత్ నామ సంవత్సరం వైశాఖ బహుళ సప్తమి శుక్రవారం అత్యంత వైభవంగా వెండి రథోత్సవం జరగనుంది. తెల్లవారుజామున అవ్వ వారి సమాధి, మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, పూల అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాధుసత్పురుషులకు, భక్తులకు అన్నదాన వితరణ జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి అవ్వ విగ్రహాన్ని వెండి రథోత్సవంపై ఉంచి పురవీధుల గుండా ఊరేగిస్తారు.

రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం చుట్టూ క్యూలైన్ కోసం టెంట్లు, బారికేడ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆలయం ముందు చలువ పందిరి వేశారు. అమ్మవారిని కొలువుదీర్చే మండపం, ఆలయ సమీపంలోని రోడ్లకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆలయంలో మందిరానికి ఉన్న స్తంభాలను బంగారం తొడుగుతో అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.

అవ్వవారి చరిత్ర

మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలూరు మండలం మూసానహళ్లిలో దళితులైన మంగమ్మ, బండెప్ప దంపతుల కుమార్తెగా పార్వతీ అంశతో జన్మించింది. పుట్టినప్పటి నుంచి విచిత్రంగా వ్యవహరిస్తూ ధ్యానంలోనే ఉండేది. దీంతో గ్రామస్తులు పిచ్చి పట్టిందని భావించారు. యుక్త వయసుకు వచ్చిన తర్వాత ఆమెను సిరుగుప్ప గ్రామానికి చెందిన మారెప్పకు ఇచ్చి పెళ్లి చేశారు. ఆమె శక్తి స్వరూపిణిగా మారడంతో భర్త భయపడి పారిపోయాడు. ఒకరోజు ఆ ఊరి నుంచి వాహనం వెళ్తుండగా అందులో ఎక్కి ఆదోనికి చేరుకుంది. ప్రస్తుతం లక్ష్మమ్మవ్వ గుడి ఉన్న చోట అప్పట్లో చిన్న గుడి, చెత్తకుండీ ఉండేది. అక్కడ కూర్చొని నెత్తిన చెత్తను చల్లుకుని ఉంటుండేది. ఆ దారిలో వెళ్లేవారికి ఏమైనా సమస్యలు ఉంటే తీర్చేది. ఆ ప్రాంతంలో అంగళ్ల వద్దకు వెళితే వ్యాపారం బాగా జరగడం, సంతానం లేనివారికి ఆమె మహిమలతో సంతానం కల్పించడంతో జనాల్లో విశ్వాసం పెరిగింది. ఒకరోజు రాత్రి ఆమె శరీరం నాలుగు భాగాలుగా పడిఉన్నట్లు చూసిన కానిస్టేబుల్ వెళ్లి సీఐకు తెలిపారు. ఆయన అక్కడకు వచ్చి చూడగా అవ్వ మామూలుగానే పడుకుని ఉంది. రాచోటి రామయ్య వంశీయులు చాకలి నరసప్ప, టీజీ వారు ఆమెను ఆశ్రయించి దగ్గరుండి సేవలు చేశారు. అవ్వ జీవించిన కాలంలోనే పల్లకి సేవ ఘనంగా నిర్వహించేవారు. 1933లో జీవసమాధి అయ్యిందని ఆలయ నిర్వాహకులు, అవ్వ బ్యాంకు సీఈఓ గట్టు మురళీకుమార్ చరిత్రను వివరించారు. రాచోటి రామయ్య వంశీకులు అక్కడ గుడి కట్టించారని, అవ్వ గుడి కింద జీవసమాధి వద్ద ధ్యానం చేసిన వారికి ఎంతో మహిమలు చూపించిందని, కోరికలు కూడా తీరాయని మురళీకుమార్ తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మహాయోగి లక్ష్మమ్మవ్వ రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నాం. మూడు గంటలకు వెండి రథోత్సవ కార్యక్రమం ఉంటుంది భగవాన్ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అవ్వ వారి పేరిట ఉచితంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు యోగా సాధన, ధ్యానం, సంగీతం, కుట్టుశిక్షణ, భరతనాట్యం, కూచిపుడి, సంస్కృతి, సత్సంగాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తున్నాం. 91వ రథోత్సవం శుక్రవారం రోజు అంగరంగ వైభవంగా జరుపుతాం. చుట్టుపక్కల గ్రామాల వారు, కొత్త జంటలు అవ్వవారిని దర్శించుకునేలా ఏర్పాటు చేశాం.

– రాచోటి రామయ్య, ఆలయ ధర్మకర్త

సేవలు విస్తృతం చేయండి

కౌతాళం: సచివాలయ సేవలను విస్తృతం చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని నదిచాగి సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. అర్జీదారుల పనులను ఏ రోజుకారోజు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇక నుంచి రోజువారీగా రిపోర్టులు పంపాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులతో ఎస్‌డీజీ సర్వే, గృహ నిర్మాణలు, నాడు–నేడు పాఠశాలల పనులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఈఓ ఆంజనేయులు, వ్యవసాయాధికారి శేషాద్రి, ఏపీఎం, నాడు–నేడు ఏఈ శివశంకర్, ఎంపీటీసీ లింగన్నగౌడ్, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

వెల్దుర్తి: పొలం తగాదా విషయంలో అన్నపై తమ్ముడు మరో వ్యక్తితో కలిసి దాడికి పాల్పడ్డాడు. బాధితుడు శ్రీను, అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కలుగొట్ల గ్రామానికి చెందిన శ్రీను, అతని తమ్ముడు శేఖర్ మధ్య పొలం అమ్మకానికి సంబంధించి తగాదా ఉంది. తమ్ముడి అన్యాయంపై పలు దఫాలు అన్న స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేయడం, పంచాయితీలు జరిగాయి. బుధవారం గ్రామ సెంటర్‌లో శ్రీను ఒంటరిగా వెళ్తుండగా దారికాచిన తమ్ముడు, మరో వ్యక్తి మునిస్వామితో కలిసి దాడికి పాల్పడ్డారు. శ్రీను తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.బాధితుడు ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



జిల్లా కలెక్టర్ జి.సృజనకు మెమొంటో అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: కర్నూలు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జి.సృజనను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు, మంత్రాలయం, కోసిగి మండలాల్లో నిరుపేదలకు పంపిణీ చేసేందుకు భూ సేకరణతో పాటు పలు అంశాల గురించి చర్చించారు. అంతకుముందు శ్రీ రాఘవేంద్ర స్వామి మెమొంటో, శేషవస్త్రం, పరిమళ ప్రసాదం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు ఆదోని వైఎస్సార్‌సీపీ నేత వై.జయమనోజ్ రెడ్డి ఉన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

మంత్రాలయం: అసైన్డ్‌మెంట్ భూముల పంపిణీల్లో అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అసైన్డ్ భూములను అర్హత ఉన్న పేదలకు పంపిణీ చేసేందుకు అధికారులు ఇప్పటికే నివేదికలు తయారు చేశారు. నివేదికలోని పేదల వద్ద నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేయడం గానీ, అడిగినట్లు గానీ తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

నిష్పక్షపాతంగా పనిచేయండి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ రంగారెడ్డి

కోసిగి(మంత్రాలయం): ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు ఉద్యోగులు నిష్పక్షపాతంగా పనిచేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా విద్యాధికారి వి.రంగారెడ్డి సూచించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, పలు సచివాలయాలను సందర్శించి ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపట్టారన్నారు. సమస్యలు ఉన్న వారు నేరుగా 1902కు ఫోన్ చేసి సమస్యను విన్నవించవచ్చున్నారు. వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పదో తరగతి, ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదివి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. డిప్యూటీ ఉర్దూ డీఈఓ ఆదామ్ బాషా, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ మొయినుద్దీన్, ఈఓపీఆర్డీ అరూన్ రషీద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.


సత్తాచాటిన పెద్దనేలటూరు వృషభాలు



పగిడిరాయిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

తుగ్గలి: వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పగిడిరాయిలో నిర్వహించిన వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రామ పెద్దలు జగన్నాథరెడ్డి, ఈశ్వరరెడ్డి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పెద్దనేలటూరు సుంకన్న, సీతారాముడు వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో అనంతపురం జిల్లా చాగల్లు ఆదినారాయణ వృషభాలు, కర్నూలు జిల్లా ఎస్ఎస్‌పీ సైడర్ మున్న మలేలా వృషభాలు, నంద్యాల జిల్లా పోదొడ్డి రంగారెడ్డియాదవ్ వృషభాలు, డి రంగాపురం రామచంద్రారెడ్డి, జేసీబీ సాయి వృషభాలు నిలిచాయి. గెలుపొందిన వృషభ యజమానులకు గ్రామ వాల్మీకి సంఘం వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు అందజేశారు. వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

విమర్శలు చేయడమే టీడీపీ పని



విలేకరుల సమావేశంలోమాట్లాడుతున్న దేవా

ఆదోని టౌన్: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆదోనిలో నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సంక్షేమానికి పనిచేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిపై విమర్శలు చేయడమే టీడీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణాధ్యక్షుడు దేవా ఆరోపించారు. బుధవారం ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గం టీడీపీ నాయకులు దేవేంద్రప్ప, మహిళా నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మ వైఎస్సార్సీపీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొనసాగిన నాలుగేళ్లలో ఆదోని గుర్తుకు రాలేదా క్రిష్ణమ్మా అంటూ ప్రశ్నించారు. ఉనికిని కాపాడుకునేందుకే వైఎస్సార్‌సీపీపై విమర్శలు గుప్పిస్తున్నారని ఆరోపించారు. స్థానిక నాయకులు సుగుణ, లక్ష్మి, కల్పవల్లి, గోవిందు, లక్ష్మీనారాయణ, రాముడు, శివన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలందించడంతో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సృజన వైద్యులు, ఇంజినీర్లను హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని సమస్యలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సూపరింటెండెంట్ లింగన్నను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి మొత్తం కలియ తిరిగి బాత్‌రూమ్‌లు, వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. చికిత్స ఎలా జరుగుతుంది, వైద్యులు సక్రమంగా వస్తున్నారా, భోజనాలు ఎలా పెడుతున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లల వార్డులో బాత్‌రూమ్ సరిగా లేకపోవడంతో ఇంజినీర్‌పై మండిపడ్డారు. వారంలోపు మరమ్మతులు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్లు సరైన సమయానికి రారని, వచ్చినా హాజరువేసి వారి క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారని కొందరు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వారంలో రెండుసార్లు ఆస్పత్రిని తనిఖీ చేసి తనకు నివేదిక అందించాలని సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. స్త్రీ, చిన్నపిల్లల ఆస్పత్రిలో గర్భిణులు కాన్పు కోసం వస్తే ఏవో సాకులు చెప్పి ప్రయివేట్ ఆస్పత్రికి పంపుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదులిచ్చారు. ఇప్పటి నుంచి సబ్ కలెక్టర్ వారానికి రెండుసార్లు, తాను కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. సమస్యలను పరిష్కరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇంజినీర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లే డాక్టర్లు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని సూచించారు. సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా దేవర మహోత్సవం

ఆదోని రూరల్: మండలంలోని హాన్వాల్ గ్రామంలో వెలిసిన దేవమ్మవ్వ, దుర్గమ్మవ్వ, కాంతారమ్మవ్వ దేవర మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గత రెండు రోజులుగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. ఉదయం కుంభాలతో కలశాల నడుమ ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాలూకా సీఐ మహేశ్వర రెడ్డి, ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆదోని డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ శివనారాయణ స్వామికి స్వాగతం పలుకుతున్న సీఐలు, ఎస్ఐలు

ఆదోని అర్బన్: ఆదోని నూతన డీఎస్పీగా శివనారాయణస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత వారంలో ఏఎస్పీగా అదిరాజ్‌సింగ్ రాణా పదవీ బాధ్యతలు చేపట్టి గంటలోపే బదిలీ అయిన విషయం విధితమే. ప్రస్తుతం ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు శివనారాయణ స్వామిని ఆదోని డీఎస్పీగా ఎంపిక చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్ పులివెందులకు బదిలీ అయ్యారు. 1995 బ్యాచ్‌కు చెందిన శివనారాయణస్వామి ఎస్ఐ, సీఐ హోదాలో అనంతపురం, కర్నూలు, నందికొట్కూరులో పని చేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. కర్నూలులో ఏసీబీలో పనిచేసి బదిలీపై ఆదోని డీఎస్పీగా వచ్చారు. నూతన డీఎస్పీ మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలిసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలపై తనకు ఫోన్ చేసి చెప్పవచ్చని, సమాచారం తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం సీఐలు మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, ఎస్ఐలు డీఎస్పీకి పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. పదవీ బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ శివనారాయణ స్వామి ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నేరుగా ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

బాధ్యతగా పనిచేయండి



పుట్టపాశం సచివాలయంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జేడీ వరలక్ష్మి

గోనెగండ్ల: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని పుట్టపాశం గ్రామ సచివాలయంను ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు శాతాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో అందిస్తున్న సేవల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఏయే సేవలపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సచివాలయంలో అందించే పలు రకాల సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారికీ సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. అలాగే సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఏఓ రాజాకిశోర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



మృతి చెందిన శివకుమార్

కౌతాళం: కుంబళనూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్ (43) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయనకు భార్య స్వప్న, ఒక కూతురు ఉంది. శివకుమార్ రెండేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయం రూ.15 వేలు అందించినట్లు ఏపీఓ జుబేర్ చెప్పారు. ఆయనకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కూడా వర్తిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ప్రదీప్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి జయమ్మ, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో–ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్ తదితరులు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రదీప్ రెడ్డి హామీ ఇచ్చారు. శివకుమార్ తండ్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శేషారావు ఈనెల 1న గుండెపోటుతో మృతి చెందాడు. పది రోజుల్లోపే చిన్న కుమారుడు శివకుమార్ మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

స్పందన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత



వెల్దుర్తిలో మాట్లాడుతున్న కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్

వెల్దుర్తి: స్పందన అర్జీల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమస్యలను పరిష్కరించేలా సేవలందించాలని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్ మండల రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వరి, మండల సర్వేయర్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఆర్‌ఐ అబ్దుల్ కలాం, వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. మండలపరిధిలో జరుగుతున్న భూముల రీసర్వే వివరాలు తెలుసుకున్నారు. వేగవంతంగా, సమస్యలు రాకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.